క్లుప్తంగా

చెరకు సాగులో మెలకువలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న విశ్రాంత ఆచార్యులు ఎన్వీ నాయుడు

పాలసముద్రం : చెరకు సాగులో మెలకువలు పాటించాలని శాస్త్రవేత్తలు సరళ, మంజుల, నాగమణి తెలిపారు. మంగళవారం రాచపాల్యంలో ఏడీఏలు నాగపద్మజి, సౌభాగ్యలక్ష్మి, ఏఓ డిల్లీ ప్రసాద్ ఆధ్వర్యంలో రైతులకు కొత్త రకం చెరకు, బెల్లం తయారీపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విశ్రాంత ఆచార్యులు ఎన్వీ నాయుడు మాట్లాడుతూ..చెరకులో కొత్త రకాలు, నాటు పద్ధతి కోత దశలో సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వరి సాగులో మెలకువలు, కలుపు నివారణ మందుల గురించి వివరించారు. శాస్త్రవేత్త నాగమణి మాట్లాడుతూ.. విత్తనశుద్ధి ప్రాముఖ్యత, దాని వలన కలిగే లాభాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చంద్రయ్య, వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం బస్తాల ఆటోను పట్టుకొన్న రెవెన్యూ అధికారులు

నగరి : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు పట్టుకొన్నారు. మంగళవారం విశ్వసనీయ సమాచారం మేరకు డిప్యూటీ తహసీల్దార్ మేఘవర్ణం, వీఆర్ఓ విజయ్‌సింహారెడ్డి వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆటోలో తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న బియ్యం బస్తాలను పట్టుకున్నారు. 18 బస్తాల బియ్యం సుమారు 815 కిలోలు, ఆటోతో పాటు డ్రైవర్‌ను పోలీసులకు అప్పజెప్పారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంటి చూపుపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పుత్తూరు : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మంగళవారం కళాశాలలో జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం చేపట్టారు. కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ కుమార్ మాట్లాడుతూ.. కంటి చూపు పట్ల విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పారా మెడికల్ ఆఫీసర్ రవిశంకర్, పీఎంఓ శేఖర్‌రెడ్డి విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు.

జెడ్పీ సీఈఓ ఆకస్మిక తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

గంగాధర నెల్లూరు : మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని మంగళవారం జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు ఆకస్మిక తనిఖీ చేశారు. మండల ప్రజా పరిషత్ పరిధిలో పీఏసీఎస్ ఓటరు జాబితాకు సంబంధించిన అంశాలను ఎంపీడీవో, అధికారులతో చర్చించి త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కార్యాలయాన్ని పరిశీలించి కార్యాలయ ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే మండల వ్యాప్తంగా పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ రవికుమార్, ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు

వడమాలపేట (విజయపురం) : వడమాలపేట జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో శేషగిరిరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 22వ తేదీ వరకు జూనియర్ కళాశాలలో ఆధార్ సెంటర్ అందుబాటులో ఉంటుందని, చుట్టు పక్కల విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పట్టాలు దాటితేనే చదువులు

ప్రయాణికులకు ప్రమాదాలు జరగకుండా గంటల తరబడి నిరీక్షణ చేయకుండా ఉండాలనే ఉద్దేశంతో రైల్వేశాఖ ఎంతో ఉన్నతాశయంతో వడమాలపేట మండలం వేమాపురంలో అండర్ రైల్వే బ్రిడ్జిని నిర్మించింది. అయితే ఆ బ్రిడ్జే వారికి శాపంగా మారింది. బ్రిడ్జి కింద ఉన్న ఊట నీటిని ఎప్పటికప్పుడు తొలగించడంలో రైల్వే అధికారులు విఫలం అవుతుండడంతో పూడి పంచాయతీ, వేమాపురం చుట్టు పక్కల ప్రజలు అగచాట్లు పడుతున్నారు. వర్షాలు పడిన ప్రతిసారి అండర్ రైల్వే బ్రిడ్జి కింద భారీగా వర్షపు నీరు చేరి ప్రయాణికుల రాకపోకలకు విఘాతం కలుగుతోంది.

- మోకాలి లోతు నీటిలో అండర్ రైల్వే బ్రిడ్జి
- బ్రిడ్జి కింద ఊట నీటిలో వెళ్లలేని దుస్థితి
- రెండు నెలలుగా ప్రజలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని రైల్వే అధికారులు



పిల్లలను స్కూల్‌లో వదిలిపెట్టడానికి పట్టాలు దాటుతున్న ఓ గృహిణి



వర్షపు నీటిలో ఆగిపోయిన ఆటోను తోసుకెళ్తున్న చోదకుడు

వడమాలపేట (విజయపురం) : చిన్న పాటి వర్షం పడిన వడమాలపేట మండలం వేమాపురం రైల్వే బ్రిడ్జి కిందకు నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నీటిని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో రెండు నెలలుగా ఆ మార్గంలోని ప్రజలు నరకయాతన పడుతున్నారు. విద్యార్థులు నీటిలో రావడమో.. లేదా రైలు పట్టాలు దాటడమో చేస్తున్నారు. ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వడమాలపేట మండలం పూడి పంచాయతీ, వేమాపురం పరిధిలోని తిరుమాడ్యం, రాజులకండ్రిగ, టీఆర్‌కండ్రిగ, ఎనమలపాలెం, అప్లాయిగుంట, శీతామారాపురం, బాలనాయుడుకండ్రిగ తదితర గ్రామాలకు వెళ్లేందుకు రైల్వే శాఖ అండర్ రైల్వే బ్రిడ్జి నిర్మించింది. కానీ భారీ వర్షం పడితే మాత్రం ఆయా పంచాయతీ ప్రజలకు గుండెల్లో గుబులు.. రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద వర్షం నీరు మోకాలి లోతు నిలిచి రాకపోకలకు వీలు కాని పరిస్థితి నెలకొంటోంది.



మోకాలి లోతు నీటిలో నడిచి వెళ్తున్న రైతు

నీటి ఊట కారణం

వర్షం పడిన ప్రతిసారీ ఇదే పరిస్థితి...ఒక్కోసారి వర్షం ఆగినా ఊట కారణంగా బ్రిడ్జి కింద ఎప్పుడూ నీరు నిలిచి ఉంటోంది. ద్విచక్ర వాహనదారుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వాహనంలోకి వర్షపు నీరు చేరి తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని, మరమ్మతులకు జేబులు ఖాళీ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు తప్పని అవస్థలు

వడమాలపేట మండల కేంద్రంలో రెండు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు, రెండు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలలో వేమాపురం, తిరుమాడ్యం, రాజులకండ్రిగ, టీఆర్‌కండ్రిగ, ఎనమలపాలెం, అప్లాయిగుంట, శీతామారాపురం, బాలనాయుడుకండ్రిగ తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు వడమాలపేటలో చదువుతున్నారు. ఈ మార్గంలో రోజుకు 10 బస్సులు తిరుగుతున్నాయి. అయితే అండర్ బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో తడుకు ఆర్ఎస్, పూడి మీదుగా సుమారు 10 కిలో మీటర్లు చుట్టుకొని రావాల్సిన దుస్థితి నెలకొంది. సైకిల్‌పై పాఠశాలకు వెళ్లే విద్యార్థులు రైలు పట్టాలు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. ఓ ఉపాధ్యాయుడు రైలు పట్టాలు దాటుతూ మృతి చెందిన ఘటన గతేడాది జరిగిందని స్థానిక ప్రజలు గుర్తుచేస్తున్నారు. అసలు పాఠశాలకు వెళ్లిన బిడ్డ తిరిగి వచ్చే వరకు తల్లిదండ్రులు ఆందోళన పడుతుంటారు. అలాగే రైతులు, దినసరి కూలీలకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు.

కార్యరూపం దాల్చని ప్రతిపాదనలు

వేమాపురం బ్రిడ్జి కింద వర్షపు నీరు నిలిచినప్పుడు సమీపంలోని గ్రామ ప్రజలకు ఇబ్బంది లేకుండా వేమాపురం నుంచి పూడి వరకు రైల్వే ట్రాక్ పక్కనే రోడ్ నిర్మిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని గతంలో ప్రతిపాదనలు చేశారు. అప్పుడు రైల్వే అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. దీంతో పూడి మీదుగా 10 కిలో మీటర్లు చుట్టుకొని రావాల్సిన అగత్యం నెలకొంది. రైల్వే అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే భారీ ఎత్తున ఆందోళనలు చేయాల్సి వస్తుందని పరిసర ప్రాంతాల ప్రజలు హెచ్చరిస్తున్నారు.

నిత్యం ఇబ్బందులు పడుతున్నాం



రైల్వే బ్రిడ్జి కింద రెండు నెలలుగా నీళ్లు తొలగించడం లేదు. రైల్వే అధికారులకు చెప్పినా స్పందన లేదు. దీంతో మూడు కిలో మీటర్ల దూరం ఉన్న వడమాలపేటకు రావాలంటే పది కిలోమీటర్లు చుట్టుకొని రావాల్సి వస్తుంది. రైల్వే అధికారులు ఒక వ్యక్తిని నియమించి ఎప్పటికప్పుడు నీటిని తొలగించాలి లేకుంటే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి.

పి.శ్రీనివాసులు, వేమాపురం

సైకిల్ నెట్టుకుంటూ పట్టాలు దాటుతున్నాం



వేమాపురం బ్రిడ్జి వల్ల సైకిల్‌ను కట్టపైకి నెట్టుకుంటూ వెళ్లి పట్టాలు దాటుకుంటూ రోజూ స్కూల్‌కు వెళ్లాల్సి వస్తోంది. స్కూల్‌కి వెళ్లి తిరిగి వచ్చే వరకు కుటుంబ సభ్యులు ఆందోళన పడుతున్నారు. రెండు నెలలుగా ఇలాగే జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎ.మహేశ్, పదో తరగతి

చెరకు రైతుల బకాయి చెల్లించాలి



చెరకు రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

నిండ్ర : మండలంలోని నేతమ్స్ షుగర్ ప్యాక్టరీ రైతుల బకాయిలు చెల్లించాలని చెరకు రైతు సంఘం నాయకులు కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కోరారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని రెవెన్యూ సమస్యలు, కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న వివిధ సమస్యలపై ఆరా తీశారు. రెవెన్యూ సమస్యలు పూర్తి స్థాయిలో విచారించి పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం చెరకు రైతుల బకాయిలు చెల్లించాలని, ప్యాక్టరీ ఎస్‌టీసీఐ ఫైనాన్స్ కంపెనీ వేలం వేయాలని చూస్తోందని రైతులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇచ్చిన తరువాతే వారు వేలం వేయాలని కలెక్టర్‌కు చెరకు రైతుల సమస్యలను వివరించారు. అందుకు స్పందించిన కలెక్టర్ చెరకు రైతులకు న్యాయం చేస్తామని, బకాయిలను ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నేతాజీ చెరకు రైతు సంఘం నాయకులు నారాయణస్వామిరెడ్డి, శ్రీనివాసులు, గుణశేఖర్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో అన్నదానం ట్రస్ట్‌కు మంగళవారం గుడిపాల మండలం పెరుమాళ్లకుప్పంకు చెందిన నాగిరెడ్డి లక్ష రూపాయలను విరాళం అందజేశారు. ఆలయ అధికారులు దా త కుటుంబ సభ్యులకు స్వామి వారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏఈఓ రవీంద్ర బాబు, సిబ్బంది చిట్టిబాబు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి



ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళి అర్పించిన మహిళా ఉపాధ్యాయులు

వడమాలపేట (విజయపురం) : భారతదేశపు మొట్ట మొదటి, ఏకైక మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ అంటూ వడమాలపేట బాలిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు జయలలిత అన్నారు. మంగళవారం 57వ గ్రంథాలయ వారోత్సవంలో భాగంగా వడమాలపేట చాచా గ్రంథాలయంలో ఉమెన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం గ్రంథాలయ అధికారిణి ద్రాక్షాయణి మాట్లాడుతూ.. ఇందిరా గాంధీ తెలివైన రాజకీయవేత్త, వ్యూహకర్త, ఆలోచనాపరురాలని గుర్తు చేశారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు కుమారి, మంజుల, సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాలతో సంస్కారం



మాట్లాడుతున్న కథా రచయిత కృష్ణస్వామిరాజు

పుత్తూరు : మంచి పుస్తకం విజ్ఞానాన్నే కాకుండా సంస్కారాన్ని నేర్పుతుందని ప్రముఖ కథా రచయిత ఆర్సీ కృష్ణస్వామిరాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఉత్తమ పాఠకులు కార్యక్రమాన్ని నిర్వహించారు. కృష్ణస్వామిరాజు మాట్లాడుతూ.. ఒక మంచి పుస్తకం మన వద్ద ఉంటే ఒక మంచి స్నేహితుడు మనతో ఉన్నట్లేనన్నారు. ప్రతిరోజూ ప్రతి విద్యార్థి చదవడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. అది పాఠ్య పుస్తకమైనా, మరో విజ్ఞానందించే పుస్తకమైనా పర్వాలేదన్నారు. అనంతరం ఉత్తమ పాఠకులుగా గుర్తించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణస్వామిరాజును కళాశాల అధ్యాపక బృందం సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చంద్రమౌళి, లైబ్రేరియన్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, అధ్యాపకులు నరసింహులు, మన్యం నరసింహులు, నాగేశ్వర రావు, శ్రీదేవి, శివయ్య పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాకు ఎంపిక

నగరి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడప్, డీఆర్‌డీఏ సంస్థలు సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో 26 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తు మనం వేసే తొలి అడుగుతోనే ప్రారంభం అవుతుందని చెప్పారు. నేడు జరిగిన ఇంటర్వ్యూలకు 49 మంది అభ్యర్థులు హాజరు కాగా 26 మంది ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ భాస్కర్‌రాజు, జేకేసీ కోఆర్డినేటర్ పంకజ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చైతన్య, కోఆర్డినేటర్ రసూల్, వివిధ కంపెనీల హెచ్ఆర్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో సంస్థల ప్రతినిధులు

భక్తి శ్రద్ధలతో సంకటహర చతుర్థి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో మంగళవారం సంకటహర చతుర్థి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. తొలుత ఆలయంలోని మూలవిరాట్‌కు అభిషేక పూజలు చేశారు. అలాగే ఉత్సవమూర్తిని అలంకరించి పల్లకిలో ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. అక్కడి వేదికపై స్వామి వారిని ఆశీనులు చేసి వేద పండితులు భక్తులతో శాస్త్రోక్తంగా వ్రతం చేయించారు. వ్రత ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓ గురుప్రసాద్, ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది కోదండపాణి, చిట్టిబాబు, రవి పాల్గొన్నారు. ప్రతినెలా సంకటహర చతుర్థి వ్రతానికి భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఉపవాస దీక్షలతో వ్రతమాచరించడానికి రాష్ట్ర వాసులే కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ నుంచి సైతం భక్తులు వస్తున్నారు. తొలుత ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకుంటున్నారు.

'మినీ గోకులం' పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న జేడీ ప్రభాకర్

ఐరాల: ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద మంజూరైన మినీ గోకులం షెడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ ప్రభాకర్ ఆదేశించారు. మినీ గోకులం షెడ్ల మంజూరైన లబ్ధిదారులకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ, మండలంలో 85 మందికి మినీ గోకులం షెడ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. లబ్ధిదారులు వీటి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. షెడ్లలో ఒక లైట్, ఫ్యాన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సకాలంలో బిల్లులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప సంచాలకులు డాక్టర్ ఆరిఫ్, సహాయ సంచాలకులు పద్మావతి, ఎంపీడీఓ ధనలక్ష్మి, ఏపీఓ సంధ్య, పశు వైద్యాధికారి పినాకపాణి తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే మామిడిలో అధిక దిగుబడి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మామిడి తోటల పెంపకంలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చని, ప్రధానంగా రైతులు తెగుళ్ల నివారణపై దృష్టి సారించాలని ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మామిడిలో ఈగ తెగులు నివారణపై మంగళవారం స్థానిక ఉద్యాన శాఖ సమావేశ మందిరంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (హైదరాబాద్), రీజినల్ హార్టికల్చర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మామిడి తోటల్లో ఈగ తెగులు కారణంగా పంటకు తీరని నష్టం వాటిల్లుతోందన్నారు. దీని నివారణకు ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించి తయారు చేసిన బుట్టలను చెట్లకు కడితే ఈ తెగులును అరికట్టవచ్చన్నారు. అలాగే సస్యరక్షణ చర్యలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక గాంధీరోడ్డులోని ఈఈ కార్యాలయ ఆవరణలో గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. వినియోగదారులు సమస్యలను తెలియజేయాలని కోరారు.

అత్యధిక కేసుల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి విష్ణువర్మ

నగరి : డిసెంబర్ 14వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారానికి న్యాయవాదులు, పోలీస్, ఎక్సైజ్ శాఖ వారు కృషి చేయాలని జడ్జి విష్ణువర్మ కోరారు. మంగళవారం కోర్టు నందు న్యాయవాదులు, పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రధానంగా అన్ని రకాల సివిల్ కేసులను రాజీ చేసుకోవచ్చునని తెలిపారు. రాజీకి లోబడిన క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులను రాజీ చేయాలని సూచించారు. నగదుతో పాటు విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు మానసిక ఆందోళనలకు దూరం కావాలంటే రాజీ మార్గమే సురక్షితమైనదని కక్షిదారులకు అవగాహన కల్పించాలని వివరించారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమం అని, దీనిపై అప్పీల్ వెళ్లే అవకాశం లేదని స్పష్టం చేశారు.

ఘనంగా రెప్కో బ్యాంకు వార్షికోత్సవం


చిత్తూరు రూరల్ (కాణిపాకం): రెప్కో బ్యాంక్ ఖాతాదారులకు అత్యుత్తమ సేవలు అందిస్తోందని ఆ బ్యాంకు చిత్తూరు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ జె. రిషి అన్నారు. చిత్తూరులో మంగళవారం ఆ బ్యాంకు 56వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంక్ 560 రోజుల ప్రత్యేక డిపాజిట్ పథకంలో వడ్డీరేటు తమ ఖాతాదారుల కోసం ప్రారంభించామన్నారు. ఈ పథకంలో వడ్డీ రేటు ప్రస్తుత బ్యాంకింగ్ రంగంలోనే మొట్టమొదటి సారిగా అత్యధికంగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్

- సభ విజయవంతం

కార్వేటినగరం : వైఎస్సార్‌సీపీ సర్వసభ్య సమావేశం ఆ శ్రేణుల్లో జోష్ నింపింది. శ్రీరంగరాజపురం మండలం కొత్తపల్లి మిట్టలో జరిగిన సమావేశం విజయవంతం అయింది. నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, విజయానందరెడ్డి, కృపాలక్ష్మి ప్రసంగంతో కార్యకర్తలు, నాయకులు, అభిమానుల్లో నూతన ఉత్తేజాన్ని నింపింది. ఈ సందర్భంగా సభలో వైఎస్సార్‌సీపీ నేతల ప్రసంగాలు ఇలా..

పార్టీకి కంకణబద్ధులు కావాలి



అలుపెరగని ఉద్యమకారుడైన జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి అడుగు జాడల్లో ప్రతి కార్యకర్త నడిచి వైఎస్సార్‌సీపీ విజయానికి కంకణబద్ధులు కావాలి. ఆయన సారథ్యంలో జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో పార్టీ విజయ కేతనం ఎగురవేసి ఎమ్మెల్యేలను వైఎస్ జగన్‌కు బహుమతిగా అందించాలి. వైఎస్సార్‌సీపీది నైతికంగా ఓటమి కాదని, ఈవీఎంల మాయాజాలంతో టీడీపీ గెలిచింది.

– రెడ్డెప్ప, మాజీ ఎంపీ, చిత్తూరు

ప్రతి కార్యకర్త ఒక సైనికుడిగా..



ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయడానికి సిద్ధంగా ఉండాలి. గంగాధర నెల్లూరును రెండో పులివెందులుగా తీర్చిదిద్దిన మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కుమార్తె కళత్తూరు కృపాలక్ష్మిని ఎమ్మెల్యేగా గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలి. టీడీపీ ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులను ఎదుర్కొని తమ సత్తా ఏంటో చాటాలి.

– విజయానంద రెడ్డి, చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి

సోషల్ మీడియాను అణచివేస్తున్న ప్రభుత్వం



వైఎస్ జగనన్న ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో విజయానికి పునాదులుగా మారుతాయి. కూటమి మోస పూరిత హామీలకు మోసపోయిన అక్కాచెల్లెమ్మలకు ఇప్పుడు జగనన్న హామీలు గుర్తుకొస్తున్నాయి. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. నేడు సోషల్ మీడియాను అణచివేత దిశగా టీడీపీ ప్రభుత్వం పని చేస్తోంది –కళత్తూరు కృపాలక్ష్మి, జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి

వైఎస్సార్‌సీపీకి పూర్వవైభవం



జిల్లా అధ్యక్షుడిగా కరుణాకర్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం వస్తుంది. విద్యార్థి దశ నుంచే కరుణాకర్‌రెడ్డి ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేశారు. టీడీపీకి ముచ్చమటలు పట్టించే ఏకైక వ్యక్తి. ఆయన వెంట నడిచే కార్యకర్తలు సైన్యంలా పనిచేయాలి. ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను అమలయ్యేలాగా పోరాడుదాం.

– నారాయణరెడ్డి, జీడీ నెల్లూరు బూత్ కమిటీ కన్వీనర్

కూటమి ప్రభుత్వానికి గుణపాఠం



మనకు అధికారం లేకపోయినా పార్టీ బలం అండగా ఉంది. కార్యకర్తలు, నాయకుల ఐక్యతతో రాక్షస పాలనకు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుదాం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేస్తూ, టీడీపీ పరాజయానికి కలసి కట్టుగా పని చేద్దాం. నేడు రాష్ట్రంలో రెడ్ బుక్‌పాలన సాగుతోంది.

– యశోధారెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు, పెనుమూరు

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే గెలుపు



వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం. చంద్రబాబు ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో డకౌట్ అయింది. ఇప్పటికే సామాన్య ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఛీకొడుతున్నారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాపై కేసులు పెట్టే శ్రద్ధ హామీలను అమలు చేయడంలో లేదు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీ బోర్లా పడటం ఖాయం.

– ధనుంజయరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి, కార్వేటినగరం

విపత్తులో విఫలమైన ప్రభుత్వం



విజయవాడ విపత్తులో సేవలు అందించలేక కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. క్యాండెల్స్, వాటర్ బాటిళ్ల కొనుగోలు పేరుతో కోట్లు కొల్లగొట్టిన పరిస్థితి కూటమిది. కరోనాలో ఇబ్బంది లేకుండా ప్రజలను అక్కున చేర్చుకున్న జగనన్నది నిజమైన పాలన. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుల పింఛన్లను తొలగించడమే లక్ష్యంగా పెట్టుకున్న చంద్రబాబు ప్రభుత్వానికి చరమ గీతం పాడాలి.

– బండి కమలాకర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్, పెనుమూరు